ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
జయశంకర్ 5 భూపాలపల్లి
ఆదివారం 10 నవంబరు 2024



సులభ్ సంపా'ధన' కోసం..

- ఈజీ మనీ కోసం అడ్డదారులు
- గుప్తనిధుల తవ్వకాలు, అటవీ జంతువుల వేటలో ముఠాలు

వివరాలు 8వ పేజీలో

సర్వే సరే.. చదువులు ఎట్లా?



- ఉపాధ్యాయులకు 'గణన' డ్యూటీలు
- ప్రాథమిక పాఠశాలల్లో విద్యాబోధనపై ప్రభావం
- పాఠాలు సరిగా సాగక విద్యార్థులకు నష్టం
- 50 శాతం కూడా పూర్తికాని సిలబస్

భూపాలపల్లిటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీచర్లకు రికాం లేకుండా పోయింది. విద్యాబోధన తోపాటు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పనులు కూడా ప్రభుత్వం అప్పగించడంతో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇటు తరగతుల నిర్వహణతోపాటు అటు సర్వేలో పాల్గొంటుండగా వీరిపై అదనపు భారం పడుతోంది. అంతేకాదు.. ఈ సర్వే నేపథ్యంలో ఒంటి పూట బడులను నిర్వహిస్తుండటంతో సర్కారు చదువులపై తీవ్ర ప్రభావం పడుతోంది. సరిగా క్లాసులు నడవక విద్యాభ్యాసం కుంటుపడుతోంది.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 11 మండలాలు, 242 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటిలో సమగ్ర సర్వే కొనసాగుతోంది. జిల్లాలో 319 ప్రాథమిక పాఠశాలలు ఉండగా 630 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. సుమారు 20రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో జిల్లాలోని 600 మంది ఉపాధ్యాయులు పాల్గొంటున్నారు. దీంతో పిల్లల చదువులకు ఆటంకం ఏర్పడుతోంది. సిలబస్ వెనుకబాటుకు గురయ్యే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో పనిచేసే వారికి కూడా డ్యూటీలు వేయడంతో చదువులు పూర్తిగా కుంటుపడుతోందని తెలుస్తోంది.

మూడు నెలల్లో మూడు ఆటంకాలు

గడిచిన మూడు నెలల్లో మూడుసార్లు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఆటంకాలు ఏర్పడ్డాయి. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కాగా సెప్టెంబరులో ఉపాధ్యాయుల డిమాండ్ మేరకు ప్రభుత్వం బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టింది. ఇలా దాదాపు 15 నుంచి 20రోజుల వరకు బోధనకు ఇబ్బంది కలిగిందనే విమర్శలు ఉన్నాయి. అలాగే అక్టోబరు చివరి వారంలో నూతన ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియ జరిగింది. దీనికి సుమారు 15 రోజులు పట్టింది. ఇలా దాదాపు నెలరన్న వరకు పాఠశాలలో బోధనా తరగతులకు ఆటంకాలు ఎదురయ్యాయి. ఈ క్రమంలోనే ఈ నెల 9 నుంచి సమగ్ర సర్వే ప్రారంభమైంది. దీనికి ప్రైమరీ తరగతులు బోధించే ఉపాధ్యాయులకు 600 మందికి విద్యా శాఖ అధికారులు బాధ్యతలు అప్పగించారు. 630 మందికి గానూ 600 మందికి అదనపు డ్యూటీలు కేటాయించడంతో పాఠశాలలు వెలవెలబోతున్నాయి.



ఇలాగైతే.. ఎలా?!

ప్రభుత్వ ఉపాధ్యాయులకు సర్వే డ్యూటీ అప్పగించడం పట్ల విమర్శలు వస్తున్నాయి. పాఠశాలలు ప్రారంభమై ఆరు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఎస్ఏ 1 పరీక్షల వరకు మాత్రమే పాఠాలు కొనసాగాయి. విద్యాసంవత్సరం ముగియడానికి ఇంకా నాలుగు నెలలు మాత్రమే మిగిలి ఉంది. ఈ క్రమంలో ఇంకా మిగిలిన 50శాతం సిలబస్ ఎలా పూర్తవుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. పైగా పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయాల్సి ఉండగా ఆ దిశలో అడుగులు కూడా పడటం లేదని తెలుస్తోంది. ఇలాగైతే తమ పిల్లల భవిష్యత్తు ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

న్యాయ సేవలు గ్రామస్థాయిలో అందాలి

హైకోర్టు జడ్జి అలిశెట్టి లక్ష్మీనారాయణ



భూపాలపల్లిలో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి లక్ష్మీనారాయణ

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): న్యాయ సేవలు గ్రామ స్థాయిలో అందాలని హైకోర్టు జడ్జి, భూపాలపల్లి, ములుగు జిల్లాల అడ్మినిస్ట్రేటివ్ జడ్జి అలిశెట్టి లక్ష్మీనారాయణ అన్నారు. భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జరిగిన న్యాయ సేవల దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉచిత, సత్వర, సమాన న్యాయం అందించాలనే ఉద్దేశంతో న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటైందన్నారు. కక్షిదారులు రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకునేందుకు లోక్అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనిపై గ్రామాల్లో అవగాహన పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా జడ్జి పి.నారాయణబాబు, ములుగు జిల్లా జడ్జి సూర్యచంద్రకళ, సీనియర్ సివిల్ జడ్జిలు జయరాంరెడ్డి, కన్నయ్యలాల్, జూనియర్ సివిల్ జడ్జి రామచంద్రారావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడి సౌఖ్య ఓఎస్‌డీ బోనాల కిషన్, డీఎస్పీ సంపత్‌రావుతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

సర్వే అధికారులకు సహకరించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



భూపాలపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): ఇంటింటి సమగ్ర సర్వేకు వస్తున్న అధికారులకు ప్రజలు పూర్తి సమాచారం అందించి సహకరించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ విజ్ఞప్తి చేశారు. భూపాలపల్లి పట్టణంలోని రెడ్డికాలనీలో శనివారం సమగ్ర సర్వేను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. సామాజికంగా, ఆర్థికంగా తోడ్పడుతుందని తెలిపారు. అర్హులకు ప్రభుత్వ పథకాల లబ్ధికి ఈ సర్వేఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. హౌస్ లిఫ్టింగ్ ప్రక్రియను ఎన్యుమరేటర్లు పకడ్బందీగా నిర్వహించారని అభినందించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అడుగు దూరంలో..



- విశ్వ విజేత కిరీటానికి చేరువైన ఓరుగల్లు చెస్ దిగ్గజం
- ఐదు రౌండ్లు ముగిసే సరికి 2808.1పాయింట్లతో దూసుపోతున్న అర్జున్
- ఇప్పటికే చెస్ క్లాసికల్ ఫిడే రేటింగ్‌లో రెండో స్థానం

వివరాలు 6లో..

ప్రజల సందేహాలను నివృత్తి చేయాలి

- కలెక్టర్లతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క
- సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై వీడియో కాన్ఫరెన్స్

ములుగు కలెక్టరేట్/భూపాలపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వేను నిరంతరం పర్యవేక్షణ చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రజల నుంచి వచ్చే సందేహాలను నివృత్తి చేయాలని అన్నారు. హైదరాబాద్ నుంచి ఆయన సీఎస్ శాంతికుమారి, ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో కలిసి ఆయన శనివారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ దివాకర, భూపాలపల్లి కలెక్టరేట్ నుంచి రాహుల్ శర్మ పాల్గొన్నారు. సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ శనివారం నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు అనేక సందేహాలు వస్తుంటాయని, వాటిని నివృత్తి చేస్తూ ముందుకు సాగాలని అన్నారు. ఎలాంటి సందేహాలున్నా ఎన్యుమరేటర్లు కలెక్టర్ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలు పడకుండా ఎన్యుమరేటర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. సర్వే ప్రక్రియలో ప్రజల పట్ల ఎన్యుమరేటర్లు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యే సర్వేలో భాగస్వాములు అయ్యేలా ఆహ్వానించాలన్నారు. సమగ్ర కుటుంబ సర్వే చాలా మంచి కార్యక్రమమని, ప్రజల సమగ్ర సమాచారం సేకరణ వల్ల అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించి వారికి ఆర్థికాభివృద్ధికి కృషి చేయడానికి దోహదపడతాయని తెలిపారు. సర్వే ప్రక్రియలో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఎన్యుమరేటర్లకు సర్వేపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సిబ్బంది నిబద్ధత, అంకితభావంతో సర్వేను విజయవంతం చేయాలన్నారు. సర్వే సమాచారం గ్రామ స్థాయిలోని చిట్టచివరి ఇంటికి చేరేవిధంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, గ్రామాలు, పట్టణాల ప్రధాన కూడళ్లలో హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ప్రజల పట్ల ఎన్యూమరేటర్లు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ములుగు అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావు, భూపాలపల్లి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ములుగు ఆర్డీవో వెంకటేశ్, భూపాలపల్లి డీపీవో నారాయణరావు, సీపీవో బాపురావు తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు 6,719 కుటుంబాల సర్వే

ములుగు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే జిల్లాలో జోరుగా సాగుతోంది. ఇళ్లకు స్టిక్కరింగ్ తర్వాత శనివారం నుంచి కుటుంబాల వారీగా కులం, ఆర్థిక తదితర సమాచార సేకరణ జరుపుతున్నారు. మొత్తం 97,552 కుటుంబాలకు గానూ తొలిరోజు 6,719 కుటుంబాల వివరాలను ఎన్యుమరేటర్లు సేకరించారు. 712 మంంది ఎన్యుమరేటర్లు, 74 మంది సూపర్వైజర్లు సర్వేలో పాల్గొన్నారు. ములుగు మండలంలో 1,260 కుటుంబాలు, వెంకటాపూర్‌లో 698, గోవిందరావుపేటలో 689, తాడ్వాయిలో 631, ఏటూరునాగారంలో 524, కన్నాయిగూడెంలో 214, మంగపేటలో 911, వెంకటాపురంలో 1168, వాజేడు మండలంలో 624 కుటుంబాల వివరాలను సేకరించారు.

భూపాలపల్లి జిల్లాలో 8,248

భూపాలపల్లి కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా జిల్లాలో తొలిరోజు ఎన్యుమరేటర్లు 8,248 కుటుబాల సర్వేను పూర్తి చేశారు. మొ త్తం 1,41,661 కుటుంబాలు ఉండగా 1,059 మంది ఎన్యుమరేటర్లు రోజుకూ 20 చొప్పున సర్వే చేస్తున్నారు.

క్రైం కార్నర్



సరస్వతి (ఫైల్)



సరస్వతి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలిస్తున్న గ్రామస్థులు

మహిళ దారుణ హత్య

ములుగు జిల్లాలో ఘటన

వెంకటాపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి భూపాలపల్లి మండలం గుర్రంపేటలో శుక్రవారం అర్ధరాత్రి ఓ మహిళ దారుణహత్యకు గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపేటకు చెందిన సకినాల సరస్వతి (45) భర్త రాజబాబు కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. ఆమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె స్రవంతికి వివాహమై పెద్దాపూర్‌లో ఉంటోంది. కుమారుడు రాకేష్ చిరువ్యాపారం చేసుకుంటూ అదే గ్రామంలో తన మేనత్త ఇంట్లో ఉంటున్నాడు. సరస్వతి ఒంటరిగానే నివసిస్తూ గొర్రెలు కాస్తూ జీవిస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి ఆమె హత్యకు గురైంది. రక్తపుమడుగులో ఉన్న సరస్వతి మృతదేహాన్ని శనివారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ శంకర్, వెంకటాపూర్ ఎస్సై సతీష్ మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు సీఐ తెలిపారు.

కుమారుడిపై అనుమానాలు!

సరస్వతి మృతిపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మద్యానికి బానిసైందని, పలుమార్లు మందలించినా ఆమె ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో భరించలేక కన్న కొడుకే ఆమెను హత్యచేసి ఉంటాడని స్థానికులు అనుమానిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఒంటరిగా నిద్రిస్తున్న సరస్వతి నివాసానికి చేరుకుని మొదటగా పక్కనే ఉన్న జాకెట్‌తో నులిమి ఆతర్వాత కొన ఊపిరితో ఉన్న ఆమెను బీరుసీసా పగులగొట్టి గొంతులో పొడిచి హత్య చేసి ఉంటాడని చర్చించుకుంటున్నారు. అయితే.. పోలీసులు మాత్రం కొడుకు చంపాడా? మరెవరైనా హతమార్చారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆమె కొడుకును పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సమాచారం.

కార్మికులు విధులకు గైర్హాజరు కావద్దు

సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి



సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి

కాకతీయఖని, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్మికులు విధులకు గైర్హాజరు కావద్దని, దీంతో స్వీయ అభివృద్ధితో పాటు సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. విధులకు హాజరు కాని కార్మికుల్లో మార్పు తీసుకొచ్చేందుకే కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ గైర్హాజరు కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు స్థానిక జీఎం కార్యాలయంలో ఆయన శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు యాజమాన్యం అనేక సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. కొందరు ఉద్యోగులు సంస్థ అభివృద్ధికోసం కృషి చేస్తుంటే, మరికొందరు విధులకు హాజరు కాకుండా కుటుంబాన్ని కష్టాలపాలు చేస్తున్నారని అన్నారు. అలాంటి వారి కోసం సింగరేణి యాజమాన్యం ఆదేశాల మేరకు ఈనెల 5వ తేదీ నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని విధులకు హాజరు కావాల సూచిచారరు. లేదంటే డిస్మిస్ కాక తప్పదని హెచ్చరించారు. ఏడాదికి వంద మస్టర్లు తప్పనిసరి అన్నారు.

ఈ సంవత్సరంలో 75 మస్టర్లు చేయని 262 మంది కార్మికులు ఉన్నారని, వారికి, వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్నామని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించాలి

ప్రత్యేక అధికారి వినయ్ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న వినయ్ కృష్ణారెడ్డి

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లను నిత్యం పర్యవేక్షించాలని ప్రత్యేక అధికారి వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన శనివారం సమావేశమయ్యారు. సమగ్ర కుటుంబ సర్వే, ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కేటాయించిన మిల్లుల్లో ఆన్‌లైన్ పర్యవేక్షణకు ప్రతి మిల్లుకు సిబ్బందిని నియమించాలన్నారు. ఓపీఎంఎస్ ఎంట్రీని నూరుశాతం పూర్తి చేయాలన్నారు. రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో పక్కగా నమోదు చేయాలన్నారు. డబ్బుల చెల్లింపు ప్రక్రియ పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులుగా తహసీల్దార్లను నియమించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీక్లీనర్లు, టార్పాలీన్లు, మాయిశ్చర్ యంత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమగ్ర సర్వేలో ఎన్యుమరేటర్లు సేకరించిన డేటాను గోప్యంగా ఉంచాలన్నారు. సమాచారం బయటకు వెళ్లకుండా కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలన్నారు. డేటా ఎంట్రీ జరుగుతున్న ప్రాంతాల్లోకి ఇతరులను అనుమతించొద్దన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సీపీవో బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి అందాల 'జాతర'

- పచ్చని కొండల మధ్య కొలువైన వేంకటేశుడు
- ఏటా కార్తీకమాసంలో బుగులోని సంబురం
- 14వతేదీ నుంచి 18వరకు జాతరకు సర్వం సిద్ధం

7



దేవాలయ ప్రధాన ద్వారం

పోడు భూములకు శాశ్వత పట్టాలు ఇవ్వాలి

▸ తుడుందెబ్బ రాష్ట్ర కన్వీనర్ కుర్స పోచయ్య



ప్రెస్‌క్లబ్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తుడుందెబ్బ నేతలు

వడ్డెపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీలు సాగుచేసుకుంటున్న పోడు భూములకు శాశ్వతపట్టాలు ఇవ్వాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుం దెబ్బ రాష్ట్ర కన్వీనర్ కుర్స పోచయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండలోని బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోచయ్యతో పాటు రాష్ట్ర కోకన్వీనర్లు సిద్దబోయిన లక్ష్మీనారాయణ, పోదెం బాబు, ఆగబోయిన రవి, గుర్రాల రవీందర్‌లు మాట్లాడారు. వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి వలస వచ్చిన లంబాడీలు తెలంగాణలో ఎస్టీలుగా చెలామణి అవుతూ ఆదివాసీల ఉద్యోగాలను కాజేయడంతోపాటు హక్కులను కాలరాస్తున్నారని దుయ్యబట్టారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం కోసం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో జిల్లా స్థాయి మహాసభలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో సోయం రాజేందర్, పుష్ప రాణి, తిరుపతి, రామ్మూర్తి, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేతో సమన్యాయం

▸ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ఘన్‌పూర్ మాడల్ కాలనీలో సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర సర్వేతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. శనివారం ఘన్‌పూర్ మాడల్ కాలనీలో అక్కెనపల్లి అంజయ్య ఇంట్లో ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. కులగణన పక్కాగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సర్వేకుప్రజలు సహకరించాలని కోరారు. రాజ్యాంగం ప్రసాదించిన రాయితీలు, రిజర్వేషన్లు, సబ్సిడీలు పొందని కుటుంబాలకు, ఇప్పటికే అభివృద్ధి సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్న పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందజేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కులగణనతో రాష్ట్రంలో ఉన్న ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, ఓసీలు, మైనార్టీలు ఎంతమంది ఉన్నారనే వివరాలు తెలుసుకోవడం జరుగుతుందన్నారు. భారతదేశంలో కుల వ్యవస్థ, అంటరానితనం, సామాజిక వెనుకబాటుతనం, ఈ రోజుకు ఉన్నాయని, దేశంలో భిన్న మతాలు విశ్వాసాలు ఉన్నాయనే విషయాన్నిమరిచి ప్రధాని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వే, కుల గణన సర్వేపై రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో డీపీవో నాగపూరి స్వరూప, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో విజయశ్రీ, ఏఈ యాసర్, రైసు మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, నాయకులు బూర్ల శంకర్, గన్ను నర్సింహులు, నీల గట్టయ్య, నీరటి ప్రభాకర్, తెల్లాకుల రామకృష్ణ, తోట సత్యం పాల్గొన్నారు.

పేద, అణగారిన ప్రజల సంక్షేమమే ధ్యేయం



లబ్ధిదారులకు వస్తువులు అందచేస్తున్న ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జస్టిస్ సుజోయ్ పాల్

న్యాయసేవాధికార సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

హైకోర్టు జడ్జి జస్టిస్ సుజోయ్ పాల్

వరంగల్ లీగల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పేద, అణగారిన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా న్యాయసేవాధికార సంస్థ పని చేస్తోందని రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ సుజోయ్ పాల్ అన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ పాల్ మాట్లాడుతూ.. సమాజంలోని పేదలు, అన్నార్థులు, మహిళలు, అంగవైకల్యం కలిగిన వ్యక్తులు తదితర నిస్సహాయతకు గురైన సమూహాల కోసం న్యాయసేవాధికార సంస్థ నిరంతరం పని చేస్తోందని ఆయన అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను న్యాయసేవాధికార సంస్థ అందిస్తున్న సేవలను పేదలు, కక్షిదారులు పీడిత ప్రజలు ఉచితంగా సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి సూచించారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులు అంతిమంగా పరిష్కరింపబడతాయన్నారు. సివిల్ కోర్టుల్లో మాదిరిగా పెండింగ్‌లో ఉండవని ఆయన పేర్కొన్నారు. న్యాయసేవాధికార సంస్థ అందిస్తున్న సేవలు పారా లీగల్ వలంటీర్లు కక్షిదారులకు అవగాహన కలిగించాలని జస్టిస్ పాల్ సూచించారు. అలాగే అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాలు గ్రామంలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ న్యాయసేవా సంస్థ సేవలను గడప గడపకూ తీసుకువెళ్లాలని న్యాయమూర్తి సూచించారు. చట్టం ముందు అందరు సమానమనే రాజ్యంగ మౌలిక సూత్రాన్ని అమలు పరిచే విధంగా న్యాయసేవాధికార సంస్థ చిత్తశుద్ధితో పని చేస్తోందని అన్నారు.

రాష్ట్ర హైకోర్టు జడ్జి, జిల్లా పోర్టు పోలియో జడ్జి జస్టిస్ మౌషమి భట్టాచార్య వర్చువల్‌గా మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాలకు చెందిన కక్షిదారులకు కుల, మతాలకతీతంగా సమన్యాయం అందించడానికి న్యాయ సేవ సంస్థ కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. న్యాయ సేవాధికారి సంస్థ మెంబర్ సెక్రెటరీ సీహెచ్ పంచాక్షరి మాట్లాడుతూ.. ప్రజలకు న్యాయం అందించే ప్రక్రియను కార్యకర్తలు క్షేత్రస్థాయిలో కక్షిదారులకు వివరించాలని, న్యాయసేవా సంస్థలు అందరినీ కలుపుకొని కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. సత్వర న్యాయం, సమ న్యాయం న్యాయసేవాధికారసంస్థల విశిష్టతలను గ్రామ స్థాయిలో విస్తృత పరచాలని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో వరంగ్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా జడ్జి వివి నిర్మాలా గీతాంబ, హనుమకొండ జిల్లా న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి సీహెచ్ రమేష్‌బాబు, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయమూర్తులు, పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్ల సత్యశారద, పి.ప్రావీణ్య, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయసవాధికార సంస్థల కార్యదర్శులు ఎం.సాయికుమార్, క్షమాదేశ్ పాండే, వివిధ ప్రభుత్వ ఉన్నతాధికారులు, వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ల అధ్యక్షులు టి.జీవన్‌గౌడ్, ఎం.రమేష్ బాబు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సిరికొండ సంజీవ రావు, భైరపాక జయాకర్, ఉమ్మడి జిల్లాల న్యాయవాదులు, టీడబ్ల్యువో, డీఆర్‌డీఏ, మెప్మా, సఖి, భరోసా, బీసీ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్, డీఎంహెచ్‌వో, చైల్డ్ ప్రొటెక్షన్‌కు చెందినవారు పాల్గొన్నారు.

స్టాల్స్ ఏర్పాటు

ఉమ్మడి జిల్లాల న్యాయసేవాధికార సంస్థలు, ప్రభుత్వ సంస్థల సహకారంతో లబ్ధిపొందినవారు స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఉత్పత్తి చేసిన వివిధ వస్తువులను ఈ స్టాల్స్‌లో ప్రదర్శించారు. టీడబ్ల్యువో, డీఆర్‌డీఏ, మెప్మా, సఖి, భరోసా, బీసీ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్, డీఎంహెచ్‌వో, చైల్డ్‌ప్రొటెక్షన్ ద్వారా లబ్ధిపొందిన వారు తాము ఉత్పత్తిచేసిన వాటిని ఇందులో ప్రదర్శించారు.

వీల్‌చైర్లు, ట్రైసైకిల్స్ పంపిణీ

అంగవైకల్యం కలిగిన వారికి రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ సుజయ్ పాల్ చేతుల మీదుగా వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. టీడబ్ల్యువో, శ్రీ గురుదేవా చారిటబుల్ ట్రస్ట్, కేఎస్ఎం ఫౌండేషన్ల ఆర్థిక సహకారంతో వారికి అందజేశారు. అదేవిధంగా స్వయం సహాయక సంఘాలకు చెక్కులను అందచేశారు. కేఎస్ఎం ఫౌండేషన్ ద్వారా రెండు ల్యాబ్ ట్యాబ్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

రేపు ములుగుకు బండి సంజయ్ రాక

ములుగు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఈనెల 11న ములుగు జిల్లా పర్యటనకు వస్తున్నారు. సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ములుగు మండలం కన్నాయిగూడెం బ్లాక్ పరిధిలోని గ్రామాన్ని సందర్శిస్తారు. సంపూర్ణత అభియాన్ అమలు తీరును పరిశీలిస్తారు. ఈ మేరకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కాళేశ్వరంలో భక్తుల రద్దీ



త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మహదేవపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి త్రివేణి సంగమ గోదావరిలో శనివారం పుణ్యస్నానాలు ఆచరించారు. గోదావరి మాతకు పాలు, పసుపు, కుంకుమ, చీర సారెలతో పూజలుచేశారు. గోదావరి మాతకు అర్పించారు. అనంతరం స్వామివారి సన్నిధానంలో కార్తీక మాసం సందర్భంగా లక్షపత్రి పూజలు, కుంకుమార్చనలు, లక్షదీపోత్సవంతో పాటు పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే కార్తీక నదీ స్నానాలు ఆచరించారు. స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా కాలసర్ప దోష నివారణ పూజలు, శని పూజలు జరిపించారు. వివిధ పూజల ద్వారా ఆలయానికి ఒక్కరోజులోనే సుమారు రూ.5 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

నిబంధనల మేరకే ఇసుక రీచ్‌ల కేటాయింపులు : ఏడీ

ములుగు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లాలో ఇసుక రీచ్‌ల కేటాయింపులు నిబంధనల మేరకే జరుగుతున్నాయని గనులు, భూగర్భ శాఖ జిల్లా సహాయ సంచాలకుడు బి.జయరాజు తెలిపారు. 'ములుగులో ఇసుక సిండికేట్ దందా' శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతి మెయిన్‌లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఈమేరకు ఓ వివరణ లేఖను విడుదల చేశారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ చైర్మన్ ఆదేశాలతో భూగర్భ జలాలు, నీటిపారుదల, రెవెన్యూ, గనుల శాఖల సంయుక్త బృందం తనిఖీలు నిర్వహించి నివేదికను సమర్పించినట్టు తెలిపారు. ఎకో సెన్సిటివ్ జోన్ ప్రాంతాలకు సంబంధించిన నివేదికను జిల్లా అటవీ అధికారి సమర్పించారన్నారు. టీజీఎండీసీ అనుమతి, పర్యావరణ క్లియరెన్స్, సీఎఫ్ఈ, సీఎఫ్‌వో అనుమతులు వచ్చిన తర్వాత పెసా గ్రామ సభలు నిర్వహించి సొసైటీలకు రీచ్‌లను కేటాయించినట్టు వెల్లడించారు. ప్రస్తుతం ఎవరికీ తుది కేటాయింపులు జరపలేదని స్పష్టం చేశారు.

అడుగు దూరంలో..

▸ విశ్వ విజేత కిరీటానికి చేరువైన ఓరుగల్లు చెస్ దిగ్గజం

▸ ఐదు రౌండ్లు ముగిసే సరికి 2808.1పాయింట్లతో దూసుకుపోతున్న అర్జున్

▸ ఇప్పటికే చెస్ క్లాసికల్ ఫిడే రేటింగ్‌లో రెండో స్థానం

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చదరంగంలో ప్రత్యర్థుల ఎత్తులను చిత్తు చేస్తూ ప్రపంచఖ్యాతిని అందిపుచ్చుకోవడానికి అడుగు దూరంలో ఉన్నాడు మన ఓరుగల్లు చెస్ క్రీడా దిగ్గజం ఇరిగేసి అర్జున్. ఈ నెల 5నుంచి 12వ వరకు చెన్నైలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ స్థాయి చెన్నై గ్రాండ్ మాస్టర్స్ చెస్ టోర్నీలో 4 రౌండ్లు ఆడి వరుసగా గెలుపొందడంతో క్లాసికల్ చెస్ ఫిడే ఎల్లో రేటింగ్‌లో అర్జున్ ఇప్పటికే రెండో స్థానానికి చేరుకొని చరిత్ర సృష్టించాడు. మొత్తం 9 రౌండ్లకు గాను 4 రౌండ్లను అధిగమించి 5వ రౌండ్‌లో ఇరాన్ దేశానికి చెందిన పరహంతో ఆడి డ్రా చేసుకోవడంతో 2808.1 ఎల్లో రేటింగ్‌తో ప్రపంచస్థాయిలో రెండో స్థానంలో నిలిచాడు. ఆదివారం తమిళనాడుకు చెందిన గ్రాండ్ మాస్టర్ అరవింద్ చిదరంబరంతో 6వ రౌండ్‌లో తలపడనున్నాడు. వరల్డ్ నెంబర్ 1గా ఉన్న మాగ్నస్ కార్ల్‌సన్ 2831 తర్వాతి స్థానంలో అర్జున్ తన విజయ యాత్ర కొనసాగిస్తున్నాడు. కాగా, విశ్వ విజేతగా నిలిచేందుకునేందుకు ఓరుగల్లు ముద్దు బిడ్డ అర్జున్ అడుగు దూరంలో ఉండటంతో అర్జున్ తల్లిదండ్రులు డాక్టర్ శ్రీనివాసరావు - జ్యోతి దంపతులు ఉమ్మడి జిల్లా ప్రజలు ఈ టోర్నీలో విజయం సాధించాలని కోరుకుంటున్నారు. భారత్‌ను తన మేధోసంపత్తితో నంబర్‌వన్ చెస్ విజేతగా ఇప్పటి రికార్డు సొంతం చేసుకున్నాడు. అదే విధంగా 14ఏళ్ల వయస్సులోనే యూఏఈ అబూదాబిలో నిర్వహించిన మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో 17వ స్థానంలో గ్రాండ్ మాస్టర్ హోదా దక్కించుకొని రాష్ట్రంలోనే తొలి స్వర్ణ పతకం సాధించిన ఘనుడు అర్జున్.



పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవిటి

బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేత పరుపాటి

▸ కండువా కప్పి ఆహ్వానించిన మాజీ సీఎం కేసీఆర్

▸ పాలకుర్తి నియోజకవర్గంలో అధికార పార్టీకి షాక్

▸ మాజీ మంత్రి దయాకర్‌రావు ఆధ్వర్యంలో ఎర్రవెల్లిలో భారీగా చేరికలు



కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, తదితరులు

రాయపర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అధికార కాంగ్రెస్ పార్టీకి పాలకుర్తి నియోజకవర్గంలో భారీ షాక్ తగిలింది. కాంగ్రెస్ నేత, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను కలవగా.. ఆయనకు కేసీఆర్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. గతంలో కేసీఆర్‌తో ఉద్యమంలో పాల్గొని మిలియన్ మార్చ్‌లో జైలు పాలైన శ్రీనివాసరెడ్డి.. మారిన రాజకీయ పరిణామాలతో కాంగ్రెస్‌లో కొనసాగారు. పాలకుర్తి నియోజకవర్గం నుంచి ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన శ్రీనివాస్‌రెడ్డి తన అనుచరులు సుమారు 500 మందితో కలిసి పార్టీలో చేరడం పట్ల కేసీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. మండలంలోని మైలారానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి కొంతకాలంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ.. పేద వర్గాల ప్రజలకు ఆసరాగా నిలుస్తున్నాడు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలతో అందరిలోనూ విసుగు : ఎర్రబెల్లి

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రభుత్వ వైఫల్యాలతో ప్రజలతో పాటు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా విసుగు చెందుతున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తన అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరడంతో పాలకుర్తి నియోజకవర్గంలో కొత్త ఉత్తేజాన్ని నింపుతుందని ఆకాంక్షించారున. తాము మరింత ఉత్సాహంతో పనిచేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని స్పష్టంచేశారు. హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం పూటకో కొత్త విషయాన్ని తెరపైకి తెచ్చి పబ్బం గడుపుతోందని, కుల గణన పేరిట ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలే సరైన బుద్ధి చెపుతారన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రంగు కుమార్, బిల్లా సుధీర్‌రెడ్డి, కాశీనాథం, వెంకట్‌రెడ్డి, పూస మధు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

మరిపెడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి మరిపెడ మునిసిపల్ పరిధి దేశ్యా తండా దగ్గర్లో 365 జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. మరిపెడ ఎస్సై బోలగాని సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం దేశ్యాతండాకు చెందిన భానోత్ వెంకన్న(50) శుక్రవారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై మరిపెడ బంగ్లాకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తీవ్ర గాయాలకు గురైన క్షతగాత్రుడిని చికిత్స కోసం ఖమ్మం తరలించగా మృతి చెందారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

రైలు కిందపడి యువకుడి మృతి



సైదులు (ఫైల్)

నెహ్రూసెంటర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని రైలు కిందపడి యువకుడు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు అనంతారం సమీపంలో శనివారం చోటు చేసుకుంది. డోర్నకల్ జీఆర్పీ ఎస్సై జె.సురేష్, స్థానికులు తెలిపిన ప్రకారం... అనంతారానికి చెందిన వల్లాల సైదులు (30) ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లి కూలీ... నాలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఇటీవల స్వగ్రామమైన అనంతారంకు వచ్చారు. ఏం జరిగిందో.. ఏమో కానీ.. గుర్తు తెలియని రైలుకింద పడి యువకుడు వల్లాల సైదులు మృతి చెందారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటన స్థలాన్ని జీఆర్పీపోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలను మోసం చేసిన మాజీ సీఎం కేసీఆర్

● సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి



మహబూబాబాద్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ వినూత్న ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మునిసిపాలిటీకి మాజీ సీఎం కేసీఆర్ రూ. 50 కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పి జీవో నెంబరు 34 ఇచ్చి నిధులను విడుదల చేయకుండా ప్రజలను మోసం చేశారని సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్ సారధిరెడ్డి విమర్శించారు. మహబూబాబాద్ పట్టణంలో మాజీ సీఎం కేసీఆర్ ఇచ్చిన 34 జీవో ప్రకారం రూ.50కోట్లు ఏవి? గారడీ జీవో నెంబరు 34 అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం వినూత్న ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అజయ్‌సారధిరెడ్డి మాట్లాడుతూ.... 30 జనవరి 2023న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా కలెక్టరేట్ భవన ప్రారంభోత్సవానికి వచ్చిన సమయంలో రూ.50 కోట్లు ఇస్తున్నట్లు ప్రకటించి జీవోలు ఇచ్చి నిధులను మంజూరీ చేయలేదని ఆరోపించారు మానుకోట మునిసిపాలిటీలో రూ.50 కోట్లు వస్తాయని 36 వార్డుల్లో 470 పనులకు టెండర్లు పూర్తి చేశారని ఇంత వరకు నిధులు రాలేదన్నారు. 2018లో నాటి పురపాలక శాఖ మంత్రి రూ. 2 కోట్లు కేటాయిస్తూ జీవో నెంబరు 367 ఇచ్చారని అవి కూడ రాకుండా కొంతమంది బీఆర్‌ఎస్ నాయకులు అడ్డు పడ్డారని ఆరోపించారు. ఇప్పటికైనా కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిధులను విడుదల చేసి మానుకోట అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బి.నీరజ, సీపీఐ నాయకులు పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, సాంబలక్ష్మి, రవి, శ్రావణ్, ఫాతిమా, వీరన్న, రవీందర్, చిదిరాల జ్ఞానేశ్వర్, రాజకుమారి, పద్మ, మంద శంకర్, నక్క నాగార్జున, విజయ్, రమేష్ పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

- కన్నుల పండుగగా అర్ధనారీశ్వరుడి పరిణయం
- ఆత్మకూరులో ముగిసిన ఆలయ పునర్నిర్మాణ వేడుకలు



ఆలయ కమిటీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

ఆత్మకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో రూ.3.5 కోట్లతో పునర్నిర్మాణం చేసుకున్న శ్రీ మహాదేవస్వామి పంచలింగాల శివాలయంలో శుక్రవారం అర్ధరాత్రి అర్ధనారీశ్వరుడి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభంగా జరిగింది. స్థానిక ఎమ్మెల్యే పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి కల్యాణానికి హాజరయ్యారు. అనంతరం దేవాలయాన్ని పరిశీలించి కమిటీ బృందాన్ని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ చరిత్రలో పూర్తి రాతి కట్టడంతో పునర్నిర్మాణం చేసుకున్న ఏకైక దేవాయంగా పంచలింగాల శివాయం నిలుస్తుందని అన్నారు. ఐదేళ్ల శ్రమించి దేవాయాన్ని పునర్నిర్మాణం చేశారని కొనియాడారు. ఎమ్మెల్యేతోపాటు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు, రాష్ట్ర ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీత పర్వతగిరి రాజు, పరకాల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మాదాసి శ్రీధర్, జిల్లా నాయకులు రేవూరి రణధీర్‌రెడ్డి, గుండెబోయిన శ్యామ్, మత్స్యశాఖ ఛైర్మన్ బయ్య తిరుపతి, బరుపట్ల కిరీటి, ఆలయ కమిటీ బృందం పాల్గొన్నారు.

పూజలు

పంచలింగాలకు శనివారం ఉదయం వేదపండితుల చేత విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం నాగవెల్లి తంతుతో పాటు మేళతాళాలు, నన్నాయి వాయిద్యాలు, మహిళల కోలాటాలు, నృత్యాలతో హరహర మహాదేవ శంభో శంకర.. ఓం నమశ్శివాయ అంటూ శివనామస్మరణతో పల్లకీసేవసేవను నిర్వహించారు.

ఈ ఉత్సవాలలో వేద పండితులు రవీంద్ర శర్మ, వరత్ వర్మ, శ్రావణ్, వర్మతోపాటు అధ్యక్షుడు వంగాల బుచ్చిరెడ్డి, ఆలయ బృందం తోట రఘు, వేవూరి దేవేందర్ రెడ్డి, సిరిపురం సంపత్, బూర కిషోర్ గౌడ్, పొగాకుల ప్రభాకర్ గౌడ్, రేవూరి జయపాల్ రెడ్డి, వంగాల భగవాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి అందాల 'జాతర'

- పచ్చని కొండల మధ్య కొలువైన వేంకటేశుడు
- ఏటా కార్తీక మాసంలో బుగులోని సంబురం
- 14వ తేదీ నుంచి 18 వరకు జాతరకు సర్వం సిద్ధం



రేగొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎటు చూసినా ఎత్తైన రాతి కొండలు.. రకరకాల ఔషధ మొక్కలు.. పక్షుల కిలకిలారావాల మధ్య గోవింద నామ స్మరణలు ప్రతిధ్వనిస్తుంటాయి. అలా ప్రకృతి అందాలు మేళవించిన బుగులోని గుట్టల్లో కొలువైన వేంకటేశ్వరుడు భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విలసిల్లుతున్నాడు. మరో విశేషమేంటంటే ఏటా కార్తీక పౌర్ణమి రోజు నుంచి నాలుగు రోజుల పాటు జాతర జరుగుతుంది. ఈ క్రమంలోనే ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు జాతరను వైభవంగా నిర్వహించేందుకు బుగులోని క్షేత్రం ముస్తాబవుతోంది. ఈ జాతరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. కుటుంబాలంతా పచ్చని చెట్ల నీడన వంటలు చేసుకుని ఆనందంగా గడిపి నిద్ర చేస్తారు.

ముక్కుడి గడ్డ నుంచి కొండల మధ్యకు..

బుగులోని వేంకటేశ్వర స్వామి ఆలయం తొలుత తిరుమలగిరి గ్రామ సమీపంలోని ముక్కుడి గుడి గడ్డ అనే ప్రాంతంలో ఉన్నట్లు గ్రామస్థులు చెబుతారు. అక్కడ ఇప్పటికీ గుడికి సంబంధించిన ఆనవాళ్లు కనిపి స్తాయి. గ్రామంలోని రోకళ్ల శబ్దాలకు వేంకటేశ్వర స్వామి, పద్మావతి, అలివేలు అమ్మవార్లు బుగులుతో కొండ పైన ఉన్న గుహలోకి వెళ్లినట్టు చెబుతుంటారు. దీంతో స్వామి వారికి బుగులోని వేంకటేశ్వరస్వామి అనే పేరు వచ్చినట్టు గ్రామస్థుల కథనం. కాగా ముక్కుడి గుడి గడ్డ వద్ద ఉన్న ఆలయం ధ్వంసమైపోగా విగ్రహాలు, స్తంభాలు కొన్ని ఇప్పటికీ ఉన్నాయి. ఇక బుగులోని పరిసరాలలో కొండను ఆనుకొని శివలింగం కూడా ఉంటుంది. ఏటా కార్తీకమాసం, శివరాత్రి సమయంలో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. కొండ పైన ఉన్న గండం దీపంలో నూనె పోసి దీపం వెలిగిస్తే గండాలు పోతాయని భక్తుల విశ్వాసం. అలాగే ఇక్కడ సమ్మక్క సారలమ్మ జాతర కూడా జరుగుతుంది. జాతరకు సమీపంలోనే సమ్మక్క, సారలమ్మల గద్దెలు నిర్మించబడి ఉంటాయి. దీంతో ఒకే దగ్గర మూడు రకాల ఆలయాలు ఉండడం భక్తుల రాకపోకలతో ఈప్రాంతంఆధ్యాత్మిక నిలయంగా విలసిల్లుతోంది.

ప్రభబండ్లు ప్రత్యేక ఆకర్షణ

బుగులోని జాతరలో ప్రభబండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. భక్తులు తమ మొక్కులు చెల్లించడానికి ఏనుగు, మేక, గుర్రం వాహనాలను తయారు చేసి డప్పుచప్పుళ్లతో నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా వస్తారు. మేకపోతులతో బండ్లను కట్టుకొని స్వామివారి ప్రతిమలను ఊరేగింపుగా జాతరకు తీసుకువస్తారు.

14 నుంచి 18 వరకు జాతర

బుగులోని జాతరలో భాగంగా 14వ తేదీన ఉదయం స్వామివారిని ఊరేగింపుగా కొండ పైకి తీసుకు వస్తారు. అదే రోజు సాయంత్రం స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. 15వ తేదీన ఉదయం అభిషేకం, దర్శన కార్యక్రమాలు జరుగుతాయి. 16వ తేదీన స్వామి వారికి నిత్య పూజలు. దర్శనాలు ఉంటాయి. అనంతరం ఏనుగ, గుర్రం వాహనాలు తిరుగుతాయి. 17వ తేదీన నిత్య పూజలు మొక్కుబడులు చెల్లిస్తారు. 18వ తేదీన ఉదయం నిత్య పూజలు మొక్కులు చెల్లించిన తర్వాత మేళతాళాలతో ఉత్సవ విగ్రహాలను గ్రామానికి తరలిస్తారు.

ఆధ్యాత్మికం





రమణీయంగా కనిపిస్తున్న బుగులోని కొండలు

భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాం

రొంటాల వెంకటస్వామి, జాతర ఛైర్మన్



బుగులోని జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సహకారంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాం. రవాణా సౌకర్యంతో పాటు జాతర పరిసరాలలో మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశాం. పలు గ్రామాలకు చెందిన పారిశుధ్య సిబ్బందితో జాతర పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్ చల్లేలా ఓ ప్రణాళిక రూపొందించాం.

నాటి కేసరి సముద్రమే.. నేటి కేసముద్రం



కేసముద్రం బోర్డు

కేసముద్రం.. మహబూబాబాద్ జిల్లాలోని ఈ ఊరిపేరు విన్నవారిలో కొందరు అమాయకంగా.. మరికొందరు వ్యంగంగా.. 'మీ ఊళ్లో సముద్రంలో ఉందా?' అని అడుగుతుంటారు. కానీ ఈ ఊరిపేరుకు ఓ చరిత్రే ఉంది. ఇప్పటి విలేజి కేసముద్రం కాకతీయుల నాటిదంటే నమ్ముతారా? నిజమే కాకతీయ వంశంలోని మొదటి ప్రోలరాజు(క్రీ.శ.1055-1075)కు అరికేసరి, అరిగజకేసరి బిరుదులుండేవి. ఆయన పాలనలో ఈ ఊరిలో ఊరచెరువు తవ్వించిన ప్రోలరాజు తన బిరుదు 'కేసరి' పదం కలిసొచ్చేలా ఆ చెరువుకు

● ఆ పేరెలా వచ్చిందంటే!

'కేసరి సముద్రం'గా నామకరణం చేసినట్టు చారిత్రక ఆధారాలున్నాయి. కాకతీయుల 'ట్యాంకు టెంపుల్ టౌన్' ఫార్ములాతో ఈ చెరువుకు అనుబంధంగా శివాలయం నిర్మించారు. అయితే నాటి 'కేసరి సముద్రం' కాలక్రమంలో 'కేసముద్రం'గా మారినట్టు చరిత్రకారులు చెబుతున్నారు. ఇక 1980 వరకు కలిసి ఉన్న చారిత్రక గ్రామం ఆ తర్వాత 'కేసముద్రం విలేజి'గాను, రైల్వేస్టేషన్ ఉండడంతో 'కేసముద్రం స్టేషన్'గా విడిపోయి రెండు గ్రామపంచాయతీలుగా మారింది. అయితే ఇప్పటికీ ఈ రెండు గ్రామపంచాయతీలు రెవెన్యూ శాఖలో మాత్రం ఒకే గ్రామం 'కేసముద్రం'గానే పేర్కొంటుండటం గమనార్హం.

- కేసముద్రం

సందడిగా టెక్నోజియాన్

- ఆవిష్కృతమవుతున్న సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలు

హనుమకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో టెక్నోజియాన్-24లో భాగంగా శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ సాంకేతిక అంశాల్లో పలు ఈవెంట్లు జోరుగా సాగాయి. వీటిల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచేందుకు తీవ్రస్థాయిలో పోటీ పడ్డారు. తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. ప్రతీ ఈవెంట్ ఒక కొత్త సాంకేతికతను ఆవిష్కరించాయి. కొన్ని మానవీయ స్పర్షకు ప్రతీతకగా నిలిచాయి. మరికొన్ని విద్యార్థుల్లో అంతర్గతంగా దాడి ఉన్న సృజనాత్మకతను తట్టి లేపాయి. వాటిలో మచ్చుకు కొన్ని..

ఫీల్ ద పెయిన్

ఇది ఒక అద్భుతమైన ఈవెంట్. టెక్నోజియాన్‌లో మొదటి సారి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ సొసైటీ ప్రదర్శించింది. సాధారణంగా స్త్రీలు బహిష్టు సమయంలో ఆ మూడు రోజులు విపరీతమైన నొప్పితో బాధపడతారు. అదే బాధను పురుషులకు కూడా అనుభవంలోకి తీసుకువస్తే స్త్రీలు పడే బాధేమిటో వారికి అర్థమవుతుందన్న భావనతో ఈ ఈవెంట్‌ను ప్రదర్శించారు. ఒక కంట్రోల్ ప్యానెల్ ద్వారా వైర్లు తలిగించిన గ్యాడ్జెట్‌ను పురుషుల పొత్తకడుపు వద్ద బిగిస్తారు. తర్వాత కంట్రోల్ ప్యానెల్ ద్వారా విద్యుత్ ఫ్రీక్వెన్సీని క్రమంగా పెంచుతున్నప్పుడు ఈ గ్యాడ్జెట్ కలిగించే ఒత్తిడి స్త్రీలు బహిష్టు సమయంలో పొందే బాధను పురుషులకు అనుభవంలోకి తీసుకు వస్తుంది. టీం లీడర్ రాకేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఫీల్ ద పెయిన్ ఈవెంట్‌లో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని ఆ బాధను అనుభవించడం కనిపించింది.

సికాడ

ఇదొక వినూత్నమైన ఈవెంట్. రకరకాల పజిల్స్‌ను విద్యార్థుల ముందు ఉంచుతారు. వారు ఆన్‌లైన్ గేమింగ్ ద్వారా వాటిని చాకచక్యంగా పరిష్కరించాలి ఉంటుంది. ఎవరైతే సమర్థవంతంగా వాటిని పరిష్కరిస్తా రో వారికి బహుమతులు ఉంటాయి.

లెట్ థెమ్ కుక్

ఇది విద్యార్థుల ప్రతిభకు పట్టం కట్టే ఈవెంట్. కుక్ అనగానే ఏదో వంట అనుకునేరు. కొన్ని చీటీలపై వివిధ రసాయనిక పదార్థాల పేర్లు రాసుంటాయి. ఈవెంట్‌లో పాల్గొనేవారు అందులో ఒక చీటి తీసి ఆ రసాయినిక పదార్థం ఇంకెన్ని రూపాల్లో ఉంటుందో ఒక పేపర్‌పై రాయాలి. ఎవరు ఎక్కువ రాస్తారో వారే విజేత. వారికి ప్రైజ్‌మనీ కూడా ఉంటుంది. కెమిస్ట్రీ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఈవెంట్ కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నది.

బ్రిడ్జి ఫ్యాబ్రికో

సివిల్ ఇంజనీరిగ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఈవెంట్ విద్యార్థుల సృజనాత్మకతకు అద్దంపటేలా ఉంది. ఈ ఈవెంట్‌లో పాల్గొనే వారికి కొన్ని వెదురుపుల్లలు, స్ట్రాలు, అడెసివ్స్ ఇస్తారు. వీటి సాయంతో నిర్ణీత సమయంలో మూడు అడుగుల వెడల్పు, పది సెంటీమీటర్ల ఎత్తుతో తమకు తోచిన డిజైన్లతో స్ట్రక్చర్స్ (కట్టడాలను) రూపొందించాలి. ఎవరో వినూత్నమైన డిజైన్‌తో సృజనాత్మకత ఉట్టిపడేలా స్ట్రక్చర్స్ రూపొందిస్తారో వారే విజేత. సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొనడం కనిపించింది.

ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్

విద్యార్థుల మేధాశక్తి, నిశిత పరిశీలనను అద్దంపట్టే ఈవెంట్ ఇది. అందు బాటులో ఉన్న ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటేనే తమ మేధాశక్తితో ఒక హత్యా సంఘటనలోని నిందితులను గుర్తించడం ఈవెంట్ ప్రత్యేకత. ముగ్గురు హంతకులు ఒక హత్యకు పాల్పడతారు. హత్యకు సంబంధించిన క్లూస్ అందుబాటులో ఉంటాయి. ఈవెంట్‌లో పాల్గొనే విద్యార్థులు ఆ క్లూస్ ఆధారంగా పరిశోధన చేయాలి. ఇన్వెస్టిగేషన్‌లో ఎదురయ్యే అడ్డంకులను ఒక్కొక్కటిగా ఛేదిస్తూ హంతకులను పట్టుకు న్నవారు విజేతలుగా నిలుస్తారు. బయోటెక్నాలజీ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఈవెంట్‌లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఫ్యూచర్ మేనేజర్

ప్రస్తుతం అంతా కార్పొరేట్ సంస్థల రాజ్యం. ఈ సంస్థల్లో కొలువు సంపాదించడమే కాదు.. అందులో రాణించాలన్నా ప్రతిభతో పాటు అన్నిటినీ ఆకళింపు చేసుకొని దూసుకుపోయే తెలివి, తెగువ కూడా ఉండాలి. ఒక సంస్థలో మేనేజర్‌గా రాణించాలంటే వేటి విషయంలో నైపుణ్యాలను ఎలా పెంచుకోవాలో నేర్చుకునే అవకాశం ఈవెంట్ కల్పిస్తోంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో ఈవెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో పాల్గొని విజేతలుగా నిలిచివారికి బహుమతులుంటాయి.



మెటలర్జికల్ ఈవెంట్‌లో పాలొన్న విద్యార్థులు

చిన్నారుల రోబోటిక్స్

టెక్నోజియాన్‌లో పాఠశాల విద్యార్థులకు కూడా అవకాశం కల్పించారు. భావి ఇంజనీర్లు అయిన ఈ చిన్నారులు తాము స్వయంగా రూపొందించిన రోబోటిక్స్ ఎగ్జిబిట్లను ఇందులో ప్రదర్శించారు. వీటిని టెక్నోజియాన్‌కు హాజరైన విద్యార్థులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. వాటి ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల విద్యార్థులు రోబోలతోపాటు ఇతర సైన్స్ ఎగ్జిబిట్లను కూడా ప్రదర్శించారు. అంబేద్కర్ లర్నింగ్ హాల్ వద్ద ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇదే చోట మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు తాము రూపొందించిన వివిధ రకాల మోటారు వాహనాలు కూడా విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ డిజైన్లలో, శ్రేణుల్లో ఉన్న ఈ వాహనాలు వేటికవే ప్రత్యేకతను కలిగి ఉన్నాయి.

ఆకట్టుకున్న ల్యాబ్రింత్ ఈవెంట్

ల్యాబ్రింత్ ఒక లేజర్ బీం ఈవెంట్. ఒక గదిలో లేజర్ బీమ్‌లను ప్రసరింపచేస్తారు. విద్యార్థులు ఈలేజర్ కిరణాలకు తగలకుండా వాటిని దాటుకుంటూ నిర్దేశిత లక్ష్యాన్ని దాటాలి. వారినే విజేతలుగా ప్రకటిస్తారు. ఈవెంట్ విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నది. పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అవి ఇవీ..

మరికొన్ని ఈవెంట్లు కూడా విద్యార్థుల ప్రతిభకు పదునుపెట్టేలా ఉన్నాయి. సరికొత్త విషయాలను నేర్చుకునేందుకు వేదికలుగా నిలుస్తున్నాయి. మ్యాథమెటికల్ సొసైటీ ఏర్పాటు చేసిన డేటా సైన్స్ క్వెస్ట్ విద్యార్థుల్లోని గణిత జ్ఞానాన్ని పరీక్షించేందుకు ఒక కొలమానంగా ఉంది. ఫొటోగ్రఫీ రిక్రియేటింగ్ క్లబ్ ది మూమెంట్ అనే ఈవెంట్, క్విజ్ క్లబ్ ఆధ్వర్యంలో సికాడా, కేబీసీ ఈవెంట్లు సైతం టోక్నోజియాన్‌లో హైలైట్స్‌గా నిలుస్తున్నాయి. అంబేద్కర్ లెర్నింగ్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో మెకానికల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వాహన ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇన్నోవేషన్ గ్యారెజ్ నిర్వహిస్తున్న ఐడియాథాన్ అత్యంత ఆదరణ పొందిన ఈవెంట్లలో ఒకటిగా నిలుస్తున్నది. సివిల్ ఇంజనీరింగ్ సొసైటీ ప్రైమవేరాపై వర్క్‌షాపు నిర్వహిస్తోంది.

విశ్వవిజ్ఞాన వేదిక టెక్నోజియాన్

- సృజనాత్మకతను పెంచుకునేందుకు అవకాశం

హనుమకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో నిర్వహిస్తున్న టెక్నోజియాన్-24 విశ్వవిజ్ఞాన వేదికకు ప్రతీకగా నిలుస్తున్నదని ఇందులో పాల్గొంటున్న విద్యార్థులు అభిప్రాయపడ్డారు. టెక్నోజియాన్‌లో భాగంగా నిర్వహిస్తున్న వివిధ ఈవెంట్లు కొత్త ఆలోచనలను కలిగిస్తున్నాయని, సరికొత్త విషయాలను తెలుసుకునేందుకు అవకాశం కలిగిస్తున్నాయన్నారు. టెక్నోజియాన్‌లో పాల్గొన్న కొందరు విద్యార్థుల మనోగతం ఇలా...

కొత్త విషయాలను తెలుసుకుంటున్నాం..

అనూష, కెమిస్ట్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థి



టెక్నోజియాన్ ద్వారా సాంకేతికతపరంగా సరికొత్త విషయాలను తెలుసుకుంటున్నాం. ఇతర కళాశాల నుంచి విద్యార్థులు వారు రూపొందించిన ఎగ్జిబిట్ల ద్వారా స్ఫూర్తి పొందుతున్నాం. ఇక్కడ ప్రదర్శిస్తున్న నూతన ఆవిష్కరణలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఇలాంటి వేడుకల్లో టెకీలు తప్పకుండా పాల్గొనాల్సిన అవసరం ఉంది.

ఈవెంట్లు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి..

కావ్యాంజలి, మెటలర్జికల్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్



టెక్నోజియాన్-24లో ప్రదర్శిస్తున్న ఈవెంట్లు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. వివిధ విభాగాల ద్వారా ప్రదర్శిస్తున్న ఈవెంట్లు వేటికవే ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అద్దం పడుతున్నాయి. టెక్నోజియాన్ ఒక విశ్వవిజ్ఞాన వేదిక. ఇందులో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నా..

ఎక్కువ ఈవెంట్లు ప్లాన్ చేయడం బాగుంది

త్రిష, సివిల్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్



గతంలో కన్నా ఈసారి ఎక్కువ ఈవెంట్లను ప్లాన్ చేయడం బాగుంది. ఈ సారి 50కిపైగా ఈవెంట్లను నిర్వహిస్తున్నారు. వీటిలో చాలా వరకు కొత్తవి ఉండడం విశేషం. గతంలో కన్నా ఈసారి ఈవెంట్ల నిర్వహణకు బడ్జెట్ కూడా చాలినంత కేటాయించారు. ఇందువల్ల ఎక్కువమంది విద్యార్థులు పాల్గొనేందుకు అవకాశం ఏర్పడింది.

ఆలోచనలకు పదును పెట్టేలా ఈవెంట్లు

శ్రావ్య, బయోటెక్నాలజీ ఫైనల్ ఇయర్



టెక్నోజియాన్‌లో నిర్వహిస్తున్న ఈవెంట్లలో ఎక్కువ భాగం ఆధునాతన సాంకేతికతను ప్రతిబింబించేలా ఉన్నాయి. చాలా ఈవెంట్లు ఇటీవల కాలంలో చోటు చేసుకున్న సరికొత్త సాంకేతికతలను జోడించి రూపకల్పన చేసినవే. వీటిలో పాల్గొన్న విద్యార్థుల్లో పోటీతత్వం పెరగనున్నది. టెక్నోజియాన్‌లో పాల్గొనడం ద్వారా ఒక కొత్త లోకాన్ని చూస్తున్నట్టు అనిపిస్తోంది.

సరికొత్త భారతం ఆవిష్కృతం

వంశీక్రిష్ణ, బయోటెక్నాలజీ ఫైనల్ ఇయర్



టెక్నోజియాన్‌కు వివిధ రాష్ట్రాల నుంచి విభిన్న సంస్కృతులకు చెందిన విద్యార్థులు హాజరుకావడంతో వరంగల్ నిట్‌లో సరికొత్త భారతం ఆవిష్కృతం అయినట్లు అనిపిస్తోంది. ఈవెంట్లో పాల్గొంటున్న విద్యార్థులు ఒకరికొకరు మమేకం అవుతున్నారు. వివిధ అంశాలపై చర్చించుకుంటున్నారు. తెలియని విషయాలు తెలుసుకుంటున్నారు.

ప్రసంగాలు ఆకట్టుకునేలా ఉన్నాయి

మనోజ్‌కుమార్ రెడ్డి, బయోటెక్నాలజీ ఫైనల్ ఇయర్



బయోటెక్నాలజీలో భాగంగా ఈవెంట్లతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో ఏర్పాటుచేసిన ప్రసంగాలు ఆకట్టుకునేలా, ఆలోచింప చేసేవిలో ఉన్నాయి. ప్రముఖులు తమరంగాల్లో రాణించిన తీరు స్ఫూర్తి దాయకంగా ఉంది. వర్క్‌షాపులు, చర్చాగోష్టులు, క్విజ్‌లు కూడా తెలియని ఎన్నో విషయాలను తెలుసుకునేందుకు దోహదం చేస్తున్నాయి. ఈ టెక్నోజియాన్‌లో పాల్నొడం మరుపురాని అనుభూతి

ఆకట్టుకున్న డ్రోన్ వెలాసిటీ ఈవెంట్



నిట్ క్యాంపస్‌లో రాత్రి వేళ నిర్వహించిన డ్రోన్ వెలాసిటీ ఈవెంట్

హనుమకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్‌లో నిర్వహిస్తున్న టెక్నోజియాన్-24లో భాగంగా శనివారం రాత్రి లైట్ల వెలుగుల్లో నిర్వహించిన డ్రోన్ వెలాసిటీ ఈవెంట్ హైలెట్‌గా నిలిచింది. ఈ ఈవెంట్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నిట్ క్యాంపస్‌లోని రోబోటిక్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ ఈవెంట్‌ను నిర్వహించారు. రాత్రి వేళ విద్యుత్ దీపాలతో రన్‌వేను ఏర్పాటు చేశారు. విద్యార్థులు రిమోట్ కంట్రోల్ ద్వారా రోబోటిక్ డ్రోన్‌ను ఈ రన్‌వే దాటి వెళ్లకుండా నిర్ణీత సమయంలో గమ్యస్థానానికి చేర్చాలి. తక్కువ సమయంలో వేగంగా నిర్ణీత గమన్యానికి చేరినవారిని విజేతలుగా నిర్ణయించారు. విద్యార్థులు ఈ ఈవెంట్‌లో పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కాగా, ఆదివారంతో టోక్నోజియస్ ముగుస్తుంది. శనివారం నిర్వహించిన ఈవెంట్లే ఆదివారం కూడా కొనసాగుతాయి. సాయంత్రం 4 గంటలకు ముగింపు కార్యక్రమం ఉంటుంది. ఆదివారం నాడు నిర్వహించే ముఖ్యమైన ఈవెంట్లలో ఎస్నేప్ రూం, ప్రాడక్ట్ లాంచ్, ఇన్నోకేమ్ ఉన్నాయి.

నిర్దేశిత లక్ష్యం దిశగా భవిష్యత్‌ను నడపండి..

- పక్కా ప్రణాళికతోనే విజయం
- మ్యాథ్స్‌స్కేర్ వ్యవస్థాపకుడు డాక్టర్ గజేంద్ర పురోహిత్
- గెలుపు మనస్తత్వం ఉండాలి.. అప్పుడే ఆశించిన ఫలితం
- మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ తనూ జైన్



విద్యార్థులతో సెల్ఫీ దిగుతున్న డాక్టర్ గజేంద్ర పురోహిత్

హనుమకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ నిర్దేశిత లక్ష్యం దిశగా భవిష్యత్‌ను నడిపించాలని మ్యాథ్స్‌స్కేర్, మోటివేషన్ స్పీకర్ గజేంద్ర పురోహిత్ పిలుపునిచ్చారు. టెక్నోజియాన్-24లో భాగంగా శనివారం రెండు అతిథి ప్రసంగాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా గజేంద్ర పురోహిత్ 'మీ భవిష్యత్తు మీ ఉద్దేశ్యంతోనే నడిపించడీ' అనే ఇతివృత్తంతో చేసిన ప్రసంగం విద్యార్థుల్లో స్ఫూర్తి నింపింది. విద్యార్థులు పక్కా ప్రణాళికతోనే ఆశించిన విజయాన్ని పొందగలుతారన్నారు. తమ భవిష్యత్తు ఎలా ఉండాలనేది నిర్ణయించుకోవలసింది విద్యార్థులే అన్నారు. ఉజ్వల భవిష్యత్తు కోసం నిరంతరం తపన, నిర్దిష్టమైన ప్రణాళిక, నిరంతర కృషి అవసరం అన్నారు. ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థులు తమ నాలుగేళ్లను ఎలా ఉపయోగించుకోవాలో గజేంద్ర పురోహిత్ వివరించారు. మొదటి సంవత్సరంలో విద్యార్థులు తమ అవసరాలు, లక్ష్యాన్ని ప్లాన్ చేసుకోవాలి, రెండో సంవత్సరంలో విద్యార్థులు సర్టిఫికేషన్ కోర్సులు, ఇంటర్న్‌షిప్‌లకు సిద్ధం కావాలి, తమ ప్రొఫైల్‌ను, రెస్యూమ్‌ను నిర్మించుకోవాలి, వివిధ పోటీల్లో పాల్గొనాలి, మూడో సంవత్సరంలో పూర్తిగా చదువుపైనే దృష్టి పెట్టాలి, చివరి సంవత్సరంలో భవిష్యత్తు కోసం సిద్ధం కావాలి అని సూచించారు. విద్యార్థులు వ్యక్తిగత ఎదుగుదల కోసం రూపొందించుకోవలసిన కొన్ని కార్యకలాపాలపై ఆయన సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు పురోహిత్ సమాధానాలు ఇచ్చారు. వారు వెలిబుచ్చిన సందేహాలను తీర్చారు. పురోహిత్ భావోద్వేగ ప్రసంగం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నది.

రెండో అతిథి స్పీకర్ అయిన మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ తనూ జైన్ చేసిన ప్రసంగం కూడా విద్యార్థులను ఉర్రూతలూగించింది. నమస్తే వరంగల్ పేరుతో ఆమె చేసిన స్ఫూర్తిదాయక ప్రసంగాన్ని విద్యార్థులు ఆసక్తిగా విన్నారు. విద్యార్థులు గెలుపు మనస్తత్వాన్ని పెంపొందించుకోవలసిన అవసరాన్ని డాక్టర్ తనూ జైన్ నొక్కి చెప్పారు. విద్యార్థులు తాము తీసుకునే ప్రతీ చర్య ఒక చేతన నిర్ణయంగా ఉండాలన్నారు. ప్రారంభ స్టార్టర్స్ మాత్రమే గెలుస్తారని, ప్రారంభ విజేతలే సాధకులవుతారని ఆమె అన్నారు. అందివచ్చిన అవకాశాలను వదులు కోవద్దని, పని చేయడం విజయంగా భావించాలని కూడా ఆమె అన్నారు. అలాగే విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. సందేహాలను నివృత్తి చేశారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

ములుగు కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏ ఒక్క కుటుంబం మిస్ కాకుండా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ దివాకర ఎన్యుమరేటర్లకు సూచించారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలోని శ్రీనివాసకాలనీ, ఎస్సీకాలనీ, ఎక్సైజ్ కార్యాలయం వెనుకవీధిలో జరిగిన ఇంటింటి సర్వేను పర్యవేక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వివరాల సేకరణలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా? అని ఎన్యుమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫారంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను ప్రతి కుటుంబం నుంచి సేకరించి నమోదు చేయడం జరుగుతుందని, ప్రజలు ఎన్యుమరేటర్లకు సహకరించి వివరాలు అందించాలని కోరారు. అన్నిస్థాయిల స్పెషలాఫీసర్లు క్షేత్రస్థాయిలో తిరుగుతూ సర్వేలో ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ విజయ భాస్కర్, సిబ్బంది ఉన్నారు.


ములుగులో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

ప్రజలకు ఇబ్బందులు కలగొద్దు : కాటారం సబ్‌కలెక్టర్


సర్వేను పర్యవేక్షిస్తున్న సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్

కాటారం (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను నిర్వహించాలని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లను ఆదేశించారు. మండల కేంద్రంలోని పలు వాడల్లో జరుగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన ప్రక్రియను ఆయన శనివారం పరిశీలించారు. సర్వేలో ఎదుర వుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొందరు సర్వేలో నమోదు చేయాల్సిన అంశాలకు సంబంధించిన వివరాలను చెప్పడానికి, సంబంధిత పత్రాలను చూపడానికి ఆలస్యం అవుతోందని ఎన్యుమరేటర్లు ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడతూ సర్వేను ఎన్యుమరేటర్లు తప్పులు లేకుండా నిబద్ధత, అంకితభావంతో పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీడీవో బాబు, తహసీల్దార్ నాగరాజు, ఎంపీవో వీరస్వామి ఉన్నారు.

అదనపు కలెక్టర్ పరిశీలన

మంగపేట (ఆంధ్రజ్యోతి): మండలంలో కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన ఇంటింటి సర్వేను అదనపు కలెక్టర్ సంపత్‌రావు పరిశీలించారు. వాడగూడెం, రమణక్కపేట, మల్లూరు, కొత్తమల్లూరు, మంగపేట గ్రామ పంచాయతీల్లో పర్యటించి ఎన్యుమరేటర్లకు ఎదురయ్యే ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వం చేస్తున్న సర్వేతో ప్రజలకు, వారి ఆస్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, తెల్లరేషన్ కార్డులపై ఎలాంటి ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి తుల రవి, ఎంపీడీవో బి.భద్రు, ఎంపీవో కిషోర్ ఉన్నారు.

సర్వేకు సహకరించాలి : డీపీవో

వెంకటాపురం, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి సర్వేకు మండలంలోని ప్రజలు సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ అన్నారు. మండలంలోని బీసీమర్రిగూడెం, చొక్కాల గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లోని కుటుంబాలను సర్వే చేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీవో మహమ్మద్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఎంపీవో హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు. కాగా, చొక్కాల గ్రామంలో జరుగుతున్న ఇంటింటి సర్వేను తహసీల్దార్ లక్ష్మీరాజయ్య పరిశీలించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేపట్టాలని ఆయన ఎన్యుమరేటర్లకు సూచించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వివరాలు సమగ్రంగా నమోదు చేయాలి

వాజేడు (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ ఎన్యుమరేటర్లకు సూచించారు.మండల కేంద్రంలో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఇంత వరకు ఎన్ని కుటుంబాల వివరాలను నమోదు చేశారని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి తప్పులు లేకుండా ప్రతి కుటుంబానికీ సంబంధించి పూర్తి వివరాలను నమోదు చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీవో శ్రీకాంత్ నాయుడు తదితరులు ఉన్నారు.

సులభ సంపా'ధన' కోసం..

ఈజీ మనీ కోసం అడ్డదారులు

గుప్తనిధుల తవ్వకాలు, అటవీ జంతువుల వేటలో ముఠాలు



కాటారం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సులభంగా డబ్బులు సంపాదించాలనే దురాలోచన కొందరిని పెడదారిన నడిపిస్తోంది. రెక్కల కష్టాన్ని నమ్ముకోక ఈజీ మనీకి అలవాటు పడుతున్నారు. సన్మార్గంలో వచ్చిన సంపాదన కన్నా ఇదే బెటర్ అనుకుంటున్నారు. చివరకు వీరి పాపం పండి కటకటాల పాలవుతున్నారు. ఇలాంటి సంఘటనలు కోకొల్లలు కాగా కాటారం డివిజన్‌లోని పలు గ్రామాలకు చెందిన వారు గుప్తనిధుల తవ్వకాల పేరిట ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్న అనేక ఉదంతాలు ఉన్నాయి.

చారిత్రక కట్టడాలు.. ప్రజలు నివసించి వెళ్లిపోయి పాడుబడ్డ గ్రామాలు.. శతాబ్దాల నాటి పురాతన ఆలయాల పరిసరాల్లో గుప్తనిధుల కోసం జోరుగా తవ్వకాలు జరుగుతున్నాయి. మండలంలోని 800ఏళ్ల నాటి ప్రతాపగిరి గుట్టపై గుప్తనిధుల తవ్వకాలు సాగాయి. కొందరికి నిధులు దొరికాయని పలువురు చెప్పడమే తప్ప వాస్తవం ఎవరికీ తెలియదు. కొందరు ముఠాలుగా ఏర్పడి గుప్తనిధుల వేటలో పడి ఆర్థికంగా నష్టపోయినవారున్నారు. ఇటీవల రెండు తలల పాము, అడవివాలుగ వంటి వాటిని సంపాదిస్తే లక్షలు వస్తాయని యూట్యూబ్‌లో చూసి వాటి వేటకు వెళ్లి చట్టం చేతికి చిక్కి ఇబ్బందుల పాలైన ఘటనలు ఉన్నాయి. అడవివాలుగను సంపాదించి డార్క్ వెబ్‌లో విక్రయానికి సమాచారం పెట్టడంతో గత నెలలో కాటారం, మహాముత్తారం మండలాల్లోని కొత్తపల్లి, కాటారం, ఇబ్రహీంపల్లి, యామన్‌పల్లి, మొలుగుపల్లి గ్రామాలకు చెందిన వారు అటవీశాఖ అధికారులకు పట్టుబడి జైలు పాలయ్యారు. వీరిలో పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కూడా ఉండటం గమనార్హం. సెప్టెంబరు 23న అర్ధరాత్రి ములుగు జిల్లాలోని ప్రఖ్యాత దేవాలయమైన రామప్ప పరిసరాల్లోని గొల్లాలగుడిలో గుప్తనిధుల తవ్వకాలు చేపట్టిన పలువురిలోనూ కాటారం మండల వాసులు ఉన్నట్లు తెలుస్తోంది. బయ్యారం, చింతకాని గ్రామాలకు చెందిన ఎర్రయ్య, గౌతం, నరేష్‌ను కారుతో సహా పట్టుకుని పోలీసులు అరెస్ట్ చేయగా మరి కొందరు తప్పించుకున్నారు. వీరిలో ఓ జాతీయ పార్టీకి చెందిన కార్యకర్తలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా కొందరు గుప్తనిధుల తవ్వకాలు, అడవి జంతువుల విక్రయాలంటూ ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుని పోలీసులు అటవీ అధికారులకు చిక్కి కేసులపాలై రెంటికి చెడ్డ రేవడిలా మారుతున్నారు. అధికార యంత్రాంగం అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ముఠాలపై దృష్టి పెట్టి వారిని ఈజీ మనీ భ్రమల్లోంచి బయటకు తీసుకురావాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

న్యూస్ రీల్

ఓటరు నమోదు చేసుకోవాలి

ములుగు కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర శనివారం ఒక ప్రకట నలో సూచించారు. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా 01-01-2025 నాటికి ప్రతిఒక్కరూ ఆదివారం నిర్వహించే ప్రత్యేక క్యాంపులో పాల్గొని ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రత్యేక క్యాంపులో ఓటరు నమోదుతోపాటు మార్పులు, చేర్పులు సరిచేయడం, మరణించిన వ్యక్తుల వివరాలు తొలగించడం, ఈ ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి నివాసాన్ని మారిన ప్రతీ ఓటరు జాబితాలో మార్పునకు దరఖాస్తు చేసుకోవడానికి వీలు కల్పించడం జరుగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి: డీవైఎఫ్ఐ

కాటారం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా సరైన వసతులు కల్పించని ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మను కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో శనివారం వినతిపత్రం అందించారు.

చిట్యాలలో కార్డన్‌సెర్చ్

చిట్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో ఎస్సై శ్రావణ్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీలోని వాహనాలను తనిఖీచేశారు. నంబర్‌ప్లేట్ లేని ఐదు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. అపరిచిత వ్యక్తులు సంచరిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని, యువకులు చెడు వ్యసనాలకు బానిస కావద్దని అన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు సహకరించాలని గ్రామస్థులను కోరారు. ఈ కార్యక్రమంలో చిట్యాల ఎస్సై-2 షాఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడిగా భద్రయ్య

భూపాలపల్లిటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) భూపాలపల్లి మండల అధ్యక్షుడిగా ఎర్ర భద్రయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి అంబాల చంద్రమౌళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొన్నేళ్లుగా ఉద్యమంలో చురుగ్గా పాల్గొని సంఘానికి, పార్టీకి సేవలు అందించిన నేపథ్యంలో మండల బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో ఎంఎస్‌పీ జాతీయ నాయకులు మందకుమార్‌మాదిగ, వేల్పుల సూరన్నమాదిగ, మాజీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొడ్డు దయాకర్, జిల్లా నాయకులు బొల్లిబాబు, గాజుల భిక్షపతి, నాయకులు దోర్నాల రాజేందర్, సోముల శ్రీనివాస్, అంతడుపుల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ములుగు కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ అన్నారు. జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ములుగులోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మహేందర్ బాల్య వివాహాలు, పోక్సో చట్టాలు, మోటార్ వెహికిల్ యాక్ట్ గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాచర్ల రాజ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేతకానీల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

వెంకటాపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నేతకానీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ నేతకాని రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కావేరి చిన్నికృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోగు మల్లయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని బూర్గుపేటలో జిల్లా నాయకుడు జాడి రాజు అధ్యక్షతన శనివారం జరిగిన గ్రామసభలో వారు పాల్గొని మాట్లాడారు. నేతకానీలను ఏ కేటగిరీ కేటాయించి సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలందించాలని, ఉద్యోగ, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా, నేతకాని కులంపై చెన్నూరు ఎమ్మెల్యే కాక వెంకటస్వామి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జాడి మూగ, దుర్గం సంపత్, రాజు, నర్సింహారావు, వెంకన్న, మండల నాయకులు బాణయ్య, జాడి నరేష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల పేరుతో ప్రభుత్వం గారడీ : గోండ్వాన పరిషత్

వెంకటాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాల పేరుతో అంకెలగారడీ చేస్తోందని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి విమర్శించారు. మండల పరిధిలోని కొమరంభీం కాలనీలో శనివారం నిర్వహించిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణన మైదాన ప్రాంతాల నుంచి వలసవచ్చిన గిరిజనేతరులకు హక్కు కల్పించే విధంగా ఉందని ఆరోపించారు. ఏజెన్సీలో గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా గిరిజనేతరులకు ఎలా హక్కు కల్పిస్తారని ఆయన ప్రశ్నించారు. ఈసమావేశంలో నాయకులు తాటి భీమయ్య, మనోజ్, లక్ష్మయ్య, మడకం భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్తీక సందడి

కాళేశ్వరాలయంలో దీపోత్సవం

మహదేవపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని కాళేశ్వర ఆలయంలో సామూహిక దీపోత్సవం జరుగుతోంది. శనివారం వేద పండితులు బైకుంఠ పాండా ఆధ్వర్యంలో అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలకు మట్టి ప్రమిదలు, దీపం వత్తులు, నూనె దేవస్థానం నుంచి ఉచితంగా సరఫరా చేశారు. మహిళా భక్తులందరికీ కుంకుమ, పసుపు, అక్షింతలు, గాజులను అర్చకులు అందజేశారు.


కాళేశ్వరంలో దీపాలు వెలిగించిన అర్చకులు

కూలీలు దొరకడం కష్టమే..

పత్తి రైతులకు తప్పని తిప్పలు

మొగుళ్లపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చేతికొచ్చిన పత్తిపంటను ఏరేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఎన్నో కష్టాలకోర్చి పత్తి పంటను సాగుచేస్తే చేతికివచ్చే సమయంలో కూలీలు దొరకకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాలో ప్రధానంగా సాగయ్యే పత్తి పంట ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా లక్ష ఎకరాల్లో సాగైంది. దీంతో పత్తి అధిక దిగుబడి వస్తుందని మార్కెటింగ్ అధికారులు అంచనా వేస్తున్నారు. వాణిజ్యపంటగా చెప్పుకునే పత్తి పంటపై జిల్లా రైతులు భారీ ఆశలు పెట్టుకున్నారు. రైతులు చేసే అప్పులను తీర్చే పంటగా గుర్తింపు పొందిన పత్తి దిగుబడులపై ఎంతో ధీమాతో ఉన్నారు. కానీ, ఈఏడు దిగుబడులు అంతంత మాత్రంగానే వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. దీనికితోడు అధిక వర్షాలు, ధరలు పడిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాల్లో కొందరు రైతులకు మాత్రమే మద్య దర దక్కుతుందన్నారు. మరి కొంత మంది రైతులకు రూ.7 వేలలోపే ధర పలుకుతోంది. జిల్లా అంతటా ఏకకాలంలో వరి, పత్తి పంటలు చేతికి రావడంతో గ్రామీణ ప్రాంతాల్లో కూలీల కొరత తీవ్రమవుతోంది. ఉదయం నుంచి సాయంత్రం పొద్దుపోయేవరకు చిన్నా,పెద్ద తేడా లేకుండా కుటుంబసమేతంగా పత్తి చేనులోనే బిజీబిజీగా గడుపుతున్నారు. సకాలంలో పత్తి ఏరకపోతే నాణ్యత కోల్పోతుందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. శీతాకాలం కావడంతో పొగమంచుతో పంట దెబ్బతినే అవకాశం ఉందని చెబుతున్నారు.

వలస కూలీలే ఆధారం

జిల్లాలో అధికంగా సాగయ్యే పత్తిపంటను ఏరేందుకు స్థానికంగా కూలీలు దొరకకపోవడంతో రైతులు పొరుగు జిల్లాల కూలీలపై ఆధారపడాల్సి వస్తోంది. మహారాష్ట్రతోపాటు కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్, హనుమకొండ, ములుగు జిల్లాల నుంచి పట్టణ కూలీలు కూడా పరుగులు తీస్తున్నారు. కిలో పత్తి ఏరేందుకు రూ.9 నుంచి రూ.10 వరకు చెల్లిస్తూ అదనంగా ఆటోచార్జీలను చెల్లిస్తున్నారు. సమయానికి కూలీలు దొరకకపోవడంతో పత్తి పంటను ఏరేందుకు గత్యంతరం లేక ఇతర జిల్లాల కూలీలపై ఆధారపడాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. అడ్వాన్సులు చెల్లించినా వస్తారో, రారో అనే భరోసా లేదంటున్నారు. కూలీల కోసం వంద కిలోమీటర్ల దూరం వెళ్లి వస్తున్నారు. సీజన్ కూలీలకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తూ సకాలంలో పంటను ఇంటికి చేర్చుకుంటున్నారు.

పెరుగుతున్న ఖర్చులు

స్థానికంగా కూలీలు దొరకకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న కూలీలతో అదనంగా ఆర్థికభారం పెరిగిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గత సంవత్సరం క్రితం పత్తి ఏరేందుకు ఒక్క మనిషికి రూ.200 నుంచి రూ.250 వరకు ఉండేది. కిలో చొప్పున పత్తి ఏరితే రూ.5 నుంచి రూ.6 వరకు చెల్లించగా ఈసంవత్సరం ఒకరికి రూ.350ల నుంచి రూ.400 చెల్లిస్తున్నారు. అలాగే కిలోకు రూ.10 వరకు డిమాండ్ పెరిగింది. తప్పని పరిస్థితుల్లో చెల్లించాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఈలెక్కన రోజుకు ఒక కూలీకి రూ.500 నుంచి రూ.700 వరకు చెల్లించాల్సి వస్తుంది. దీంతోపాటు కొన్ని గ్రామాల్లో కూలీలకు అద్దె ఇల్లు, వంట సామగ్రి ఏర్పాటు చేస్తున్నారు.

భారమవుతున్న వ్యవసాయం

రైతులకు కూలీల కొరత ఏర్పడటం, మరోపక్క ఆశించిన దిగుబడి రాక, వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడం, పెట్టుబడులు పెరగడం వంటి పలు సమస్యల కారణంగా వ్యవసాయం భారంగా మారుతుందని రైతులు చెబుతున్నారు. పండించిన పంట డబ్బులు పెట్టుబడికే సరిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పంట దిగుబడ తగ్గి ఖర్చులు పెరగడంతో ఆదాయంపై రైతులు ఆశలు వదులుకున్నారు. ఉన్న కాస్త పంటను ఇంటికి చేర్చుకోవాలన్న తపనతో రైతులు హడావిడి చేస్తున్నారు. కూలీల కొరత కారణంగా రోజులతరబడ పత్తి ఏరే ఓపికలేక అధిక కూలీకి, గుత్తాగా, కిలో లెక్కన ఇస్తూ పత్తిని ఏరిస్తూ పంటను ఇళ్లకు చేర్చుకుంటున్నారు.

రోడ్డును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


మంత్రి ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న కమిటీ సభ్యులు

మల్హర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్ల నుంచి ఖమ్మంపల్లికి వెళ్లే రోడ్డును ధ్వంసం చేసిన ఓసీపీలో బొగ్గు నిక్షేపాలు వెలికితీస్తున్న కంపెనీపై చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జెన్‌కో భూ నిర్వాసిత హక్కుల సాధన కమిటీ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం సమర్పించారు. ప్రజల సౌకర్యార్థం ఆర్‌అండ్‌బీ శాఖ లక్షలు వెచ్చించి రోడ్డును నిర్మిస్తే బొగ్గు నిక్షేపాలు వెలికితీస్తున్న కంపెనీ ధ్వంసం చేసి ప్రజలకు, ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. ఏడేళ్లుగా డేంజర్ జోన్‌లో ఇబ్బందులు పడుతున్న నిర్వాసితులకు పరిహారం చెల్లించి, సురక్షిత ప్రాంతానికి తరలించాలని కోరారు. అలాగే ఓసీపీలో పని చేస్తున్న కార్మికులకు జెన్‌కో ఉద్యోగుల మాదిరిగా జీతాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తాడిచర్ల, కాపురం గ్రామాల జెన్ కో భూ నిర్వాసితుల హక్కుల సాధన పోరాట సమితి అధ్యక్షుడు కేసారపు రవి, ప్రధాన కార్యదర్శి తాండ్ర సంతోష్, కమిటీ సభ్యులు ఇందారపు ఎల్లయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలి

హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మీనారాయణ

ములుగు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, కార్మిక చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని హైకోర్టు న్యాయమూర్తి అలిశెట్టి లక్ష్మీనారాయణ అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవం శనివారం ములుగు జిల్లా కోర్టులో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి మాట్లాడతూ న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న సేవలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అంతకు ముందు గట్టమ్మ దేవాలయం వద్ద జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎస్‌వీపీ.సూర్యచంద్రకళ, జిల్లా సీనియర్ జడ్జి కన్హయ్యలాల్, సివిల్ జడ్జి సౌఖ్య, జిల్లా కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్ ఆయనకు స్వాగతం పలకగా గట్టమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వినయ్‌కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి కె.సునీల్ కుమార్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందిస్తున్న భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



ములుగులో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి లక్ష్మీనారాయణ

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన భూపాలపల్లి కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి అనిశెట్టి లక్ష్మీనారాయణను భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో న్యాయమూర్తిని కలిసిన పుష్పగుచ్ఛం అందించారు.

నాంచారమ్మ గుడికి మరమ్మతులు చేపట్టాలి

తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజు


నాంచారమ్మ గుడిని పరిశీలిస్తున్న రాజు

వెంకటాపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాంజా పూర్ గ్రామశి వారులో ఉన్న పురాతన నాంచారమ్మ గుడికి మరమ్మతులు చేపట్టా లని తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం గ్రామంలో శిథిలావస్థలో ఉన్న శివలింగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ 800 ఏళ్ల క్రితం నాంచారమ్మ పంచకూటాలయాన్ని నిర్మించడం జరిగిందని అన్నారు. నాంచారమ్మను ప్రతి ఏటా రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు, రైతులు దర్శించుకుని పూజలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రభుత్వం నాంచారమ్మ గుడికి మరమ్మతులు చేపట్టి పూర్వవైభవం తీసుకురా వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కేతిరి భిక్షపతి, నాయకులు కేతిరి సుభాష్, రాజశేఖర్, పాలకుర్తి సురేష్, బాపు, రాము, శ్రీరాములు, పోశాలు పాల్గొన్నారు.

భక్తాంజనేయ స్వామి ఆలయంలో గోపూజ

మల్హర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లారంలోని శివ పంచాయితన సహిత భక్తాంజనేయ స్వామి ఆలయంలో గోపాష్టమి సందర్భంగా గోపూజ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్తీక మాసం శుక్ల పక్షంలో వచ్చే అష్టమినే గోపాష్టమిగా అంటారని, గోమాతకు పూజ చేయడం వల్ల సర్వ దేవతలను పూజించిన ఫలితం దక్కుతుందని అర్చకుడు శ్యామ్‌సుందర్ శర్మ తెలిపారు.

ఈ సందర్భంగా భక్తులందరూ గోవుకు నవధాన్యాకు కలిపిన బెల్లం, నానబెట్టిన అటుకులు నైవేద్యంగా తినిపించారు. గోవులను సంరక్షించడం వల్ల పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని, తద్వారా గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై పోలీసుల దాడిని ఖండించాలి : బీఆర్‌ఎస్

గోవిందరావుపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రెండో విడత దళితబంధు నిధులు విడుదల చేయాలని కోరుతూ లబ్ధిదారుల పక్షాన పోరాడుతున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై పోలీసులు చేసిన దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లకావత్ నర్సింహనాయక్ కోరారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలుచేయడంలో వైఫల్యం చెందిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని, ఇప్పటికే ప్రజాభిమానాన్ని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇంటింటి సర్వే చేపట్టిందని అన్నారు. హామీలు అమలు చేసేవరకు బీఆర్‌ఎస్ పోరాడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు రుద్రబోయిన మల్లేష్, అజ్మీరా లక్ష్మణ్, రాజు, వస్రాంనాయక్, శ్రీనివాసరావు, రాజు, దేవా, మిట్టు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు సన్మానం

ములుగు కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ములుగు పట్టణంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌కు శనివారం బంజారా సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు రవిచందర్‌కు పూలబొకేలు, జ్ఞాపికలు అందజేసి శాలువాలతో సన్మానించారు. అనంతరం రవిచందర్ మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని, తన కష్టాన్ని గమనించిన మంత్రి సీతక్క జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ పదవి కట్టబెట్టారని, ఆమెకు ఎంతో రుణపడి ఉంటామని అన్నారు. బంజారాలకు మున్ముందు తనవంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బంజార సంఘం అధ్యక్షుడు పోరిక మోహన్‌లాల్, నాయకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.